జ్వాల దశ

నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM

సోమవారం 05 01 2026

సంపుటి 1 సంచిక 45

పేజీలు : 04

RNI : TGTEL/25/A4195

నిత్య నూతన ఒరవడితో ప్రజలకు ఎప్పటికప్పుడు నూతన వార్తలను అందజేస్తున్న జ్వాలా దశ పత్రిక కేలండర్‌ను ఆదివారం నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చిప్పలపల్లి గ్రామస్తులు ఆవిష్కరించారు. రానున్న రోజుల్లో ప్రజల మన్నలను జ్వాల దశ పత్రిక పొందాలని కోరుతూ గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో ఆవిష్కరించారు.

దశ, నల్గొండ

ఆధార్‌తో నకిలీలు ఔట్



ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న సిబ్బంది వివరాలను ఆధార్ కార్డుతో అనుసంధానం

15 వేల మంది నకిలీ ఉద్యోగులు ఉన్నట్లు సమాచారం

దశ, హైద్రాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వ్యవస్థలో జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న సిబ్బంది వివరాలను ఆధార్ కార్డుతో అనుసంధానం చేయడంతో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ప్రక్రియ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 15 వేల మంది నకిలీ ఉద్యోగులు ఉన్నట్లు ఆర్థిక శాఖ ప్రాథమికంగా గుర్తించింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా వెల్లడించిన వివరాలు ఇప్పుడు రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారాయి. గత కొంతకాలంగా కొన్ని ఏజెన్సీలు, మరికొందరు అవినీతి అధికారుల అండదండలతో పని చేయని వ్యక్తుల పేర్ల మీద కూడా జీతాలు డ్రా చేస్తున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఈ 'డూప్లికేట్' ఉద్యోగుల వల్ల ప్రతి నెలా కోట్లాది రూపాయల ప్రభుత్వ ధనం దుర్వినియోగం అవుతోంది. దీనిని అరికట్టేందుకు ప్రతి ఉద్యోగి వివరాలను ఆధార్‌తో అనుసంధానించాలని సర్కార్ ఆదేశించింది. ఈ తనిఖీలు పూర్తి కావడంతో దాదాపు 15 వేల మంది ఉద్యోగుల వివరాల్లో పొంతన లేదని.. వారు కేవలం కాగితాల మీద మాత్రమే ఉన్నారని తేలింది. వీరిని తొలగించడం ద్వారా వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో నిధులు ఆదా కానున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరం (202627) బడ్జెట్ రూపకల్పనపై ఆర్థిక శాఖ ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. రాష్ట్రానికి వచ్చే ఆదాయ వనరులపై నిర్వహించిన సమీక్షలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. గత రెండు నెలలుగా రియల్ ఎస్టేట్ రంగం పుంజుకోవడంతో రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే ఆదాయంలో 12 శాతం వృద్ధి నమోదైంది. అలాగే మైనింగ్ రంగంలో లీకేజీలను అరికట్టడం వల్ల అక్కడ ఏకంగా 22 శాతం వృద్ధి కనిపించింది. ఎక్సైజ్ శాఖ ద్వారా వచ్చే ఆదాయం కూడా గత తొమ్మిది నెలలుగా స్థిరంగా కొనసాగుతోంది.

కేంద్ర బడ్జెట్ కేటాయింపులను కూడా పరిగణనలోకి తీసుకుని.. కేంద్ర పథకాలను రాష్ట్రంలో పూర్తిస్థాయిలో అమలు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. నకిలీ ఉద్యోగుల ఏరివేత ద్వారా వ్యవస్థలో పారదర్శకత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అక్రమాలకు పాల్పడుతున్న ఏజెన్సీల పని పట్టడమే లక్ష్యంగా ఈ తనిఖీలు సాగాయి. రాబోయే బడ్జెట్‌లో ప్రజా సంక్షేమ పథకాలకు పెద్ద పీట వేస్తూనే.. అనవసర ఖర్చులను తగ్గించుకోవాలని ఆర్థిక శాఖ భావిస్తోంది. రియల్ ఎస్టేట్, మైనింగ్ రంగాల నుంచి వస్తున్న అదనపు ఆదాయం రాష్ట్ర అభివృద్ధి పనులకు ఊతమివ్వనుంది.

ముంబైలో న్యాయవాదులతో.. ముఖ్యమంత్రి రేవంత్ భేటీ

దశ, హైద్రాబాద్ : తెలంగాణ ప్రభుత్వం.. ఆంధ్రప్రదేశ్ నిర్మిస్తున్న పోలవరం, నల్లమల్ల సాగర్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో న్యాయ పోరాటం చేస్తోంది. ఈ క్రమంలో సోమవారం సుప్రీంకోర్టులో వాదనలు జరగనున్నాయి. దీనికి ముందుగా, తెలంగాణ సీఎం ఏ. రేవంత్ రెడ్డి, నీటిపారుదల మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ముంబైలో సుప్రీంకోర్టు సీనియర్ అడ్వకేట్ అభిషేక్ సింఘ్వీతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణ తరపున బలమైన వాదనలు వినిపించేందుకు చర్చలు జరిగాయి. దీనికి సంబంధించి కాంగ్రెస్ ఫర్ తెలంగాణ సోషల్ మీడియా మాధ్యమం 'ఎక్స్' పోస్ట్‌లో ఈ వివరాలు పంచుకున్నారు. సెంట్రల్ వాటర్ కమిషన్ అనుమతులు లేకుండా DPR సన్నాహాలు, గోదావరి ట్రిబ్యునల్ అవార్డు, ఏపీ రీఆర్గనైజేషన్ యాక్ట్ ఉల్లంఘనలు, తెలంగాణలో ముంపు ప్రమాదం. ఈ ప్రాజెక్టు పోలవరం డ్యామ్ నుంచి నీటిని లిఫ్ట్ చేసి నల్లమల్ల సాగర్‌కు తరలించేలా రూపొందించారని తెలంగాణ ప్రభుత్వం ఆరోపిస్తోంది. ఈ ప్రాజెక్టులు తెలంగాణకు హానికరమని, న్యాయస్థానంలో తగిన ఆధారాలతో పోరాడుతామని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది.

ప్రతిపక్షం లేకుండా అడ్డగోలు అబద్ధాలు

సీఎంపై కల్వకుంట్ల కవిత విమర్శలు

హరీష్ రావు మాటవిని అసెంబ్లీని బిఆర్ఎస్ పార్టీ వాకౌట్

సూర్యాపేట జిల్లాకేంద్రంలో జనంబాట కార్యక్రమం

దశ సూర్యాపేట ప్రతినిధి: అసెంబ్లీలో కేసీఆర్ తప్పులు చేశాడనే వాదన తప్ప కృష్ణా నది నీటి వాటా పై చర్చ లేదనీ ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో తెలంగాణ జాగృతి బాటలో కల్వకుంట్ల కవిత ఘాటు విమర్శలు చేశారు. కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి ఎత్తు పెంచి 100 టీఎంసీల నీటిని తెలంగాణ నష్టపోయే పరిస్థితి ఏర్పడిన ప్రశ్నించకుండా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తరం రాసి వదిలేశారని మండిపడ్డారు. కృష్ణ నీటి వాటాలో తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే నాలుగు రాష్ట్రాల మీద మాట్లాడకుండా కేవలం ఆంధ్ర ప్రదేశ్ దోపిడీ మీదనే సీఎం మాట్లాడడం విడ్డూరంగా ఉందని హేళన చేశారు. ప్రతిపక్షం అంటే ఒక పార్టీ మాత్రమే కాదు ప్రజల గొంతుకగా ఉండాలన్నారు. సూర్యాపేటలో మిషన్ భగీరథ నీళ్లు 20 రోజుల నుండి రావడంలేదని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. సూర్యాపేటలో రోడ్డు వెడల్పు కోసం ఇండ్లు కూల్చారు కానీ 300 కుటుంబాలకు పరిహారం మరిచారనీ వారికి వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూల్చేటప్పుడు అన్ని డిపార్ట్మెంట్ వాళ్ళు ఉన్నారు. పరిహారం కోరితే మాకు సంబంధం లేద నీ అన్ని డిపార్ట్మెంట్ వాళ్ళు మాట్లాడడం విడ్డూరమన్నారు. జిల్లా కేంద్రంలోని పుల్లారెడ్డి చెరువు ట్యాంక్ బండ్ కడతాను అని ఇంతవరకు దాని ఉసే ఎత్తడం లేదన్నారు. గతంలో జగదీష్ రెడ్డి తల్లి జ్ఞాపకం గా పాత ఎస్పీ ఆఫీసులో కబడ్డీ పోటీలు నిర్వహిస్తే అప్పుడు ప్రమాదం జరిగి ఒకరు చనిపోగా 26 మందికి తీవ్ర గాయాలు అయ్యాయనీ ఇంతవరకు వారిని జగదీష్ రెడ్డి పట్టించుకోలేదన్నారు. నాగారంలో సర్పంచ్ ఎన్నికల్లో ఓటుకు పదివేలు ఇచ్చి తండ్రిని జగదీష్ రెడ్డి గెలిపించుకున్నారనీ ఎద్దేవ చేశారు.

అప్పుల ఒత్తిడితో బిల్డర్ భార్య ఆత్మహత్య

దశ, ఎల్బీ నగర్: అప్పుల ఒత్తిడిని తట్టుకోలేక ఓ బిల్డర్ భార్య ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన హైదరాబాద్‌లోని సరూర్ నగర్‌లో చోటుచేసుకుంది. సరూర్‌నగర్‌లో రియల్ ఎస్టేట్ బిల్డర్ భార్య బూరుగు అర్చన కుటుంబం రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడులు పెట్టింది. అయితే హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పడిపోవడం తద్వారా అమ్మకాలు తగ్గడంతో అర్చన కుటుంబంలో ఆర్థిక సమస్యలు తీవ్రమయ్యాయి. పెట్టుబడులతో అప్పులపాలై ఆ ఒత్తిడిని తట్టుకోలేక అర్చన బలవన్మరణానికి పాల్పడింది. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

వేయిస్తంభాల దేవాలయంలో జస్టిస్ పట్టాభి రామారావు పూజలు

దశ, హనుమకొండ: చారిత్రిక వేయిస్తంభాల దేవాలయంలో కొలువైన రుద్రేశ్వరుడు మహాన్వితాశక్తి కలిగిన దేవుడని అందుకోసమే పదవీ బాధ్యతలు స్వీకరించి ఈ దేవాలయాన్ని సందర్శించానని హనుమకొండ జిల్లా న్యాయమూర్తిగా పనిచేసి పదోన్నతిపై రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన టి.పట్టాభిరామారావు అన్నారు. ఆయన వారి కూతురితో కలిసి ఆదివారం దేవాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆలయ మర్యాదలతో స్వాగతంపలికి ఉత్తిష్ట గణపతికి దర్శనం కల్పించి రుద్రేశ్వరస్వామికి వారి గోత్రనామాలతో మారేడు దళములతో పుష్పములతో మహాఅర్చన నిర్వహించారు. అనంతరం ఆలయ నాట్యమండపంలో వారికి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలు అందించి వేదఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ దేవాలయంలో ఆ రుద్రేశ్వరుని దర్శించుకున్న వారు అభిషేకించుకున్న వారు ఎంతోమంది న్యాయమూర్తులు రాష్ట్రస్థాయిలో పదోన్నతలు పొందారన్నారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి డి.అనిల్ కుమార్ స్వాగతం పలికారు. ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేందర్‌శర్మ, అర్చకులు పెండ్యాల సందీప్‌శర్మ వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. వారి వెంట జిల్లా న్యాయస్థాన సిబ్బంది ఉన్నారు.

మూగజీవాల నుంచి రక్తం సేకరణ



దశ, మేడ్చల్ : మేడ్చల్ జిల్లాలో పోలీసులు అర్ధరాత్రి జాయింట్ ఆపరేషన్ చేపట్టారు. మూగ జీవాల నుంచి రక్తం సేకరించి బయటకు తరలిస్తున్న ముఠాగుట్టు రట్టు చేశారు. కీసర పీఎస్ పరిధి సత్యనారాయణ కాలనీలో సీక్రెట్‌గా మూగ జీవాల నుంచి రక్తం సేకరిస్తున్నట్టు గుర్తించారు. నిర్వాహకులు మటన్ షాపులో రక్తం సేకరించి బయటకు తరలిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి మటన్ షాప్ యజమాని సోనూ, నకిలీ వెటర్నరీ డాక్టర్ సంజయ్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు సుమారు 180 రక్తం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు ఈ వ్యాపారం వెనుకున్న నెట్‌వర్క్ కూపీ లాగుతున్నారు.

తగ్గిన రిజిస్ట్రేషన్లు



గత ఏడాది 13 లక్షల డాక్యుమెంట్లు...ఈసారి 12.50 లక్షలకే

రిజిస్ట్రేషన్ల సంఖ్య సుమారు 50,000 తగ్గింది.

దశ, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ రంగాన్ని ఆదుకోవడానికి మార్కెట్ విలువల పెంపును నిలిపివేసినా, ఆ రంగం ఇంకా గడ్డు పరిస్థితుల్లోనే ఉంది. 202526 ఆర్థిక సంవత్సరంలో (డిసెంబర్ వరకు) గత ఏడాదితో పోలిస్తే రిజిస్ట్రేషన్ల సంఖ్య సుమారు 50,000 తగ్గింది. గత ఏడాది 13 లక్షల డాక్యుమెంట్లు నమోదు కాగా... ఈసారి 12.50 లక్షలకే పరిమితమయ్యాయి. అయితే... రిజిస్ట్రేషన్లు తగ్గినా ఆదాయం రూ. 11,100 కోట్లకు పెరగడం విశేషం. హోమ్ లోన్ల కోసం రైతులు ఆస్తి విలువను ఎక్కువగా చూపడమే దీనికి కారణం. అయినప్పటికీ, ప్రభుత్వం నిర్దేశించుకున్న రూ. 19,100 కోట్ల వార్షిక ఆదాయ లక్ష్యాన్ని చేరుకోవడం ప్రస్తుతం అధికారులకు పెద్ద సవాలుగా మారింది. తెలంగాణ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ రంగాన్ని తిరిగి బలోపేతం చేసేందుకు మార్కెట్ విలువల సవరణను తాత్కాలికంగా నిలిపివేయడం.. బిల్డర్లలో మనోధైర్యాన్ని నింపేలా సానుకూల నిర్ణయాలు తీసుకోవడం వంటి అనేక చర్యలు చేపట్టింది. అయినప్పటికీ.. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం ఇంకా సంక్షోభం నుండి పూర్తిగా బయటపడలేదని రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ డిపార్ట్ మెంట్ తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుత 202526 ఆర్థిక సంవత్సరంలో (డిసెంబర్ వరకు) ఆస్తుల రిజిస్ట్రేషన్ల సంఖ్య ఆందోళనకరంగా తగ్గింది. ఇందులో నివాస, వాణిజ్య ప్రాంతాల రిజిస్ట్రేషన్లతో పాటు వివాహ నమోదులు, మ్యుటేషన్లు కూడా ఉన్నాయి. రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గినప్పటికీ.. ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో స్వల్ప పెరుగుదల కనిపిస్తోంది. గత ఏడాది ఇదే సమయానికి రూ. 10,500 కోట్ల ఆదాయం రాగా.. ఈ ఏడాది రూ. 11,100 కోట్లు సమకూరాయి. అయితే.. ప్రభుత్వం నిర్దేశించుకున్న రూ. 19,100 కోట్ల భారీ ఆదాయ లక్ష్యాన్ని చేరుకోవడం ఇప్పుడు క్లిష్టంగా మారింది. 202425 ఆర్థిక

..మిగతా 4వ పేజీలో ➔

ట్యాపింగ్ కేసులో నవీన్ రావు విచారణ

దశ, హైద్రాబాద్ : తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో భారత్ రాష్ట్ర సమితి ఎమ్మెల్సీ కె. నవీన్ రావు రెండోసారి విచారణ ఎదుర్కొన్నారు. ఇవాళ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ అధికారులు ఆయనను ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ సంబంధిత వ్యక్తులతో నవీన్ రావుకు ఉన్న పరిచయాలు, సంబంధాలపై ప్రధానంగా సిట్ అధికారులు ప్రశ్నలు అడిగినట్టు సమాచారం. విచారణ అనంతరం నవీన్ రావు మాట్లాడుతూ, 'విచారణకు అన్ని విధాలా సహకరించాను. మళ్లీ రావాలని చెప్పలేదు, కానీ ఎప్పుడు పిలిచినా రావడానికి సిద్ధం. డివైస్‌లు ఉపయోగించి ఫోన్ ట్యాపింగ్ చేశానన్న ఆరోపణలు అవాస్తవం' అని అన్నారు.